ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
ఆదివారం 29 జూన్ 2025



కొనసాగుతున్న పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

కోల్‌సిటీటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో పాలిసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతున్నది. రెండవ రోజు శనివారం జరిగిన పరిశీలన కార్యక్రమానికి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థుల పాలిసెట్ ర్యాంక్ కార్డు, పదవ తరగతి మెమో, స్టడీ సర్టిఫి కెట్‌కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం, పదో తరగతి టీసీ, ఆధార్‌కార్డు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ల జిరాక్స్ కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురేష్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్ తెలిపారు.

రామగుండంలో ఉత్కంఠకు తెర

- 60 డివిజన్లు, 1.85 లక్షల ఓటర్లు
- డివిజన్ల పునర్విభజనకు ఆమోదం

8

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి): ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్‌మాస్టర్లతో విద్యపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన దిశగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం పాఠశాలలో 10శాతం కంటే ఎక్కువ ఉపాధ్యాయులు ఒకేరోజు సెలవు తీసుకోకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు పక్కాగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు, ఇతర సదుపాయాల కల్పన పనులు చేశామని, ఎక్కడైన ఇంకా అవసరం ఉంటే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, గణితం వంటి కనీస విద్యా ప్రమాణాలు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చినుకు రాలదు.. చింత తీరదు..



పెద్దబొంకూర్ శివారులో రైతులు పోసిన వరి నారు

- ముందుకు సాగని వ్యవసాయ పనులు
- సాధరణం కంటే తక్కువ వర్షపాతం నమోదు
- ఆందోళనకు గురవుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లాలో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. వర్షాకాలం ఆరంభమై నెల రోజులు గడుస్తున్నా కూడా ఇప్పటీ వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసి న దాఖలాలు లేవు. ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 148.1 మిల్లీ మీటర్లు కాగా, కేవలం 70.7 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయ్యింది. సాధారణానికి 52 శాతం లోటు వర్ష పాతం ఉంది. ఏ ఒక్క మండలంలో కూడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. దీంతో ఈ ఏడాది ఆశించిన మేరకు వర్షాలు పడతాయా, లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ముందే భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినప్పటికీ, ఒక్క వాన కూడా పడడం లేదు. దుక్కులు దున్ని, వరి నార్లు పోసుకుని, వేసిన ఆరుతడి విత్తనాలు మొలకెత్తడానికి రైతులు దిగులుతో ఆకాశం వైపు చూస్తు న్నారు. మురిపిస్తున్న మబ్బులు.. కదులుతున్న మేఘాలతో రైతులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. వర్షాలు పడక నేలలో వేసిన విత్తనాలు నేలలోనే మాడి పోయే ప్రమాదమేర్ప డింది. జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి, వ్యవసాయ బావులు, బోరు బావులు, చెరువులు, కుంటల కింద 2,76,076 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖాధికా రులు అంచనా వేశారు. గత ఏడాది వానాకాలంలో 2,72,678 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది అదనంగా 3,368 ఎకరాల్లో సాగు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో అత్యధికంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలనే సాగు చేస్తున్నారు. వానాకాలంలో 2,12,500 ఎకరాల్లో వరి, 705 ఎకరాల్లో మొక్కజొన్న, 5 ఎకరాల్లో పెసర, 5 ఎకరాల్లో మినుము, 250 ఎకరాల్లో కంది, 10 ఎకరాల్లో వేరుశెనగ, 5 ఎకరాల్లో నువ్వులు, 52,500 ఎకరాల్లో పత్తి, 10,086 ఎకరాల్లో మిర్చి, పసుపు, ఆయిల్ ఫామ్, కూరగాయల పంటలు సాగు కానున్నాయని అధికారులు అంచనా వేశారు. ఈ పంటల సాగుకు గాను 32,447 మెట్రిక్ టన్నుల యూరియా, 7,900 టన్నుల డీఏపీ, 23,453 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 6,331 పొటాష్ ఎరువులు, 600 టన్నుల సూపర్ సల్ఫేట్ ఎరువులు, మొత్తం 70,731 టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేశారు.

● ముదురుతున్న వరి నార్లు.. మొలకెత్తని విత్తనాలు

వానాకాలం సీజన్‌కు రైతులు దుక్కులు దున్ని ఆరుతడి విత్తనాలు వేశారు. వర్షాలు పడక ఆ విత్తనాలు కొన్ని నేలలోనే మాడిపోగా, మరికొన్ని మొలకలు ఎండి పోతున్నాయి. జిల్లాలో అత్యధికం గా వరి సాగు కానుండడంతో చాలా మంది రైతులు అధిక దిగుబడులు

(మిగతా 8వ పేజీలో)

జిల్లాలో ఇప్పటి వరకు వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)..

క్రసం.	మండలం	సాధారణం	కురిసింది
1.	ధర్మారం	139.2	68.8
2.	పాలకుర్తి	141.4	103.8
3.	అంతర్గాం	147.0	84.1
4.	రామగుండం	150.9	68.8
5.	రామగిరి	151.2	67.6
6.	కమాన్‌పూర్	164.3	87.5
7.	పెద్దపల్లి	150.6	64.4
8.	జూలపల్లి	133.8	54.6
9.	ఎలిగేడు	149.8	55.5
10.	సుల్తానాబాద్	152.0	68.0
11.	ఓదెల	132.2	38.3
12.	కాల్వశ్రీరాంపూర్	152.5	80.4
13.	ముత్తారం	165.6	65.2
14.	మంథని	165.6	65.2
	మొత్తం	148.1	70.7

మైనార్టీ స్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం తనిఖీ చేశారు. పాఠశాల అవరణ, కిచెన్ రూం, రైస్ స్టాక్, కూరగాయలను తనిఖీ చేశారు. డార్మెటరీ రూమ్, కిచెన్, జూనియర్ కళాశాల గదుల నిర్మాణాలను పరిశీలించారు. క్లాస్ రూంలో విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. స్కూల్‌లో విద్యా బోధన, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, ఆహారాన్ని అందించాలని సూచించారు.

పాలనా వ్యవహారాలలో అధికార భాష అమలు

- ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్

జ్యోతినగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలో పాలనా వ్యవహారాల్లో రాజ్‌భాష హిందీని సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రాజెక్టు ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. శనివారం ఎన్టీపీసీలో జరిగిన రాజ్‌భాష ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో ఈడీ ప్రసంగిస్తూ అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం హిందీ భాష విషయంలో ఉపయోగించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి పని సమయాల్లో హిందీ భాషను మాట్లాడాలన్నారు. కాగా, రాజ్‌భాష టౌన్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఈ నెల 23న జరగగా, డిపార్ట్‌మెంటల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో శనివారం జరిగింది. ఈ సమావేశాల సందర్భంగా హిందీకి సంబంధించి నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలకు ఈడీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంథని సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి



రింగ్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



పీవీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాం తంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్రంగా అభివృద్ధి చేయటానికి ప్రత్యేక ప్రణా ళికతో ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. రూ. 125 కోట్లతో గోదావరినదిపై నిర్మించే హైలెవల్ బ్రిడ్జి, రూ. 162 కోట్లతో పట్టణ శివారులో నిర్మించే రింగ్ రోడ్డు, రూ.22 కోట్లతో నిర్మించే 50 పడకల ఆసుపత్రి నిర్మా ణ పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శనివారం శంఖు స్థాపన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి స్థానిక శివకిరణ్ మంథని, ముత్తా రం, కమాన్‌పూర్, రామగిరి మండాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరు పై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంత్రి శ్రీధర్ బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైలెవల్ బ్రిడ్జి, రింగ్ రోడ్డు నిర్మాణాల్లో భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం నుంచి ఇప్పిస్తామన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో చెన్నూరు, మంచి ర్యాల, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంద న్నారు. ఈ ప్రాంత ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించడానికి అన్ని హంగులతో నూతన ఆసుపత్రిని నిర్మిస్తున్నామన్నారు. మంథని టౌన్‌లో కరెంట్ సరఫరాలో హెచ్చతగ్గులు లేకుండా చూడాలన్నారు. రాబోయే 3 నెలల్లో విద్యుత్ సరఫరా చాలా కీలకమన్నారు. మంథని ప్రాం తంలో నూతనంగా 1417 రేషన్‌కార్డులు జారీ చేశామన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఒక రేషన్ షాపును చిన్నసూపర్ మార్కెట్‌గా అభివృద్ధి చేయాలన్నారు. మంథని ఆసుపత్రికి వచ్చే రోగులను ఎక్కువగా గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు స్టాఫ్ రెఫర్ చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్‌లో సిల్ట్ తొలగించాలని ఆదేశించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సుందిళ్ల గ్రామంలో సింగరేణి మైనింగ్ లీజు భూములు పరి హారం అర్హులకు అందించేందుకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేశామన్నారు. వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి శ్రీధర్‌బాబు పంపిణీ చేశారు. మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి మంత్రి శ్రీధర్‌బాబు నివాళులర్పించారు.

నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జూలై 12లోపు నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి, అర్హతగల ఎంబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజన సదుపాయం, టీఏ, వసతి కల్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు 21నుంచి 30సంవత్సరాల వయస్సులోపు ఉండాలని, ఏదైన డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని, ఎంబీసీ 36కులాల వారికి మాత్రమే శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వీరి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.5లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2లక్షలు ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూలై 12లోపు టీజీఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు జతచేసి పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఉన్న బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 14లోపు సమర్పించాలని తెలిపారు. నిరుద్యోగ ఎంబీసీ యువత ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి తెలిపారు.

ఖని ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు కేటాయించాలి

- వైద్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మంత్రి దామోదర రాజనర్సింహతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు, ఆసుపత్రి పరిశుభ్రత కోసం నిధులు, మరిన్ని పడకల విస్తరణ కోసం చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతులపై చర్చించారు. అత్యవసర వైద్య సేవలకు 108వాహనాల సంఖ్య పెంచాలని, ప్రభుత్వం ఉన్న వాహనాలు కండీషన్‌లో లేవని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని, పిడియాట్రిక్, గైనకాలజిస్ట్, ట్రామాకేర్ వంటి విభాగాలకు హెచ్‌ఓడీలను నియమించాలని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల అటెండెన్స్ కోసం ప్రత్యేక డైనింగ్ హాల్, రెస్ట్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, నూతన మార్చురీని నిర్మించాలని, అందులో సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి అవసరమైన నిధులు కేటాయించి తక్షణమే పనులను చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొనాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

పెద్దపల్లిటౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జూలై 9న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. సమ్మె సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. కార్మికులకు నష్టం చేస్తూ, యజమానులకు లాభం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులందరికీ నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్స్‌తో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో జిల్లాలోని మున్సిపల్ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సావణ పెల్లి వెంకటస్వామి, నాయకులు ఆరేపల్లి చంద్రయ్య, బొంకూరి సాగర్, కుక్క అన్వేష్, చింతల మరియా, సలిగంటి సుశీల,సుద్దాల సతీష్, మహంకాళి సురేష్, బొంకూరి శంకర్, మద్దెల రాజయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

హాస్టల్‌కు వెళ్లమని మందలించిన తల్లిదండ్రులు

● పురుగుల మందు తాగిన విద్యార్థిని

● చికిత్స పొందుతూ మృతి


వైష్ణవి(ఫైల్)

గన్నేరువరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీహాస్టల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కూన సంపత్-అనితదంపతులకు కుమారుడు సంజయ్, కుమార్తె వైష్ణవి(14) సంతానం. వీరువ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ పిల్లలను స్థానిక ప్రభుత్వపాఠశాలలో చదివిస్తున్నారు. కూతురు వైష్ణవి 8వ తరగతి చదివేందుకు ఈ సంవత్సరం ఇల్లంతకుంట మండలంలోని కేజీబీవీ పాఠశాలలో సీటు రావడంతో వైష్ణవిని హాస్టల్‌కు పంపించారు. హాస్టల్‌లో ఉండి చదువుకోవడానికి వైష్ణవి ఇష్టపడకపోవడంతో తండ్రి సంపత్ ఇటీవల కూతురికి నచ్చజెప్పి మళ్లీ పంపిస్తానని ఇంటికి తీసుకు వచ్చాడు. ఈనెల23న వైష్ణవిని హాస్టల్‌లో చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించి పొలం పనులకు వెళ్లిపోయారు. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని వైష్ణవి ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు ఇంటికివచ్చేసరికి వైష్ణవి వాంతులు చేసుకుంటుండగా గమనించి వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. తండ్రి సంపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు.

బాలికను కుట్టిన తేలు

● చికిత్స పొందుతూ మృతి


మహేల(ఫైల్)

చందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తేలు కాటుకు గురైన ఓ బాలిక(8) చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కదురిక సరిత-రమేష్‌ల కూతురు మహేల రెండు కాళ్లపై ఈనెల 19న తేలు కాటు వేసింది. దీంతో మహేల తల్లి సరిత జోగాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ సంజీవ్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన వచ్చి రెండు ఇంజక్షన్లు ఇచ్చి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం మహేల అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా ఆర్ఎంపీ సంజీవ్‌కు సమాచారం అందించారు. అతడి సూచన మేరకు వేములవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం చెందింది. ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్లే బాలిక మృతిచెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


అజయ్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన బద్దిపడిగ విజయ-మల్లారెడ్డిలు అజయ్‌రెడ్డి(22)ని దత్తత తీసుకొని పెంచుకుంటున్నారు. అజయ్‌రెడ్డి కొంత కాలంగా మండలకేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మల్లారెడ్డి ఆరేళ్ల క్రితం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

కేంద్ర మంత్రిత్వ శాఖ దరఖాస్తుల ఆహ్వానం



భగత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉపాధి మంత్రిత్వ శాఖ బీడీ కార్మి కుల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి ఉపకార వేత నాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం అందించే ఉప కార వేతనాల కోసం దరఖాస్తు చేసుకో వాలని కొత్తపల్లి బీడీ కార్మిక సంక్షేమ నిధి ఆస్పత్రి వైద్యులు సూచిస్తున్నారు.

● **ప్రోత్సాహకం ఇలా..**

1వతరగతి నుంచి నాలుగోతరగతి వరకు రూ.1000, 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు రూ.1500, 9-10 తరగతులకు రూ.2 వేలు, ఇంటర్ రూ.3 వేలు, డిగ్రీ, ఐటీఐ, ఇ తర ప్రొఫెషనల్ కోర్సులకు రూ.6 వేలు, బీ టెక్, బీఎంఎస్ తదితర కోర్సులకు రూ.25 వేల ఉపకార వేతనాలు అందించను న్నారు.

● **దరఖాస్తుకు చివరి తేదీ**

ఒకటి నుంచి పదోతరగతి చదివే విద్యార్థుల ఉపకార వేతనాల కోసం ఆగస్టు 31లోపు, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెసల్ కోర్సుల విద్యార్థులు అక్టోబరు 31లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 040-25561297 నంబరులో సంప్రదించాలి.

● **ఉపకార వేతనాలకు అర్హతలు**

పీఎఫ్ ఐడీ కార్డు తప్పనిసరి. విద్యార్థుల పేరున బ్యాంక్ పాస్ బుక్ ఉండాలి. గతేడాది మార్కుల మెమో జత చేయాలి. 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. నెలకు కనీసం రూ.10 వేల ఆదాయం మించి ఉండరాదు. కార్మికులకు ఇద్దరు పిల్లలు కలిగి ఉండి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే విడి విడిగా వారి వారి పేర్లపై బ్యాంక్ అకౌంట్ తీయాలి. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నేరుగా ఉత్తీర్ణత సాధించిన వారే అర్హులు. సప్లిమెంటరీలో పాస్ అయిన వారు అనర్హులు. దూర విద్యనభ్యసించే వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

సద్వినియోగం చేసుకోవాలి
- డాక్టర్ కె.అనూషరాణి, బీడీ కార్మిక సంక్షేమ నిధి వైద్యురాలు, కొత్తపల్లి

ఉపకార వేతనాలకోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం అందించే చేయూతను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలి.

రామగుండం సీపీ అంబర్ కిశోర్‌కు ఉత్కృష్ట సేవా పతకం


సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాకు కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట సేవా పతకాన్ని ప్రకటించింది. పోలీస్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు కేంద్రం ఈ పథకాన్ని ఇస్తుంది. 2009 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అంబర్ కిశోర్ ఝా వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం వృత్తిపరమైన నైపుణ్యంతో విధులు నిర్వర్తించినందుకు గాను ఈ పతకానికి ఎంపిక చేశారు. ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన సీపీ అంబర్ కిశోర్ ఝాను అధికారులు, సిబ్బంది అభినందించారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలో జరిగిన చోరీ కేసును పోలీసులు వారంలోపే ఛేదించారు. చోరీకి పాల్పడిన తిరునహరి రాజనర్సింహస్వామి అనే దొంగను అరెస్టు చేసినట్లు సీఐ రాజు శనివారం తెలిపారు. మంథనిలోని ఇల్లెందుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈనెల 22న హైదరాబాద్‌కు వెళ్లి ఈనెల 24న తిరిగి ఇంటికి రాగా ఇంట్లో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా మంథనికి చెందిన తిరునహరి రాజనర్సింహస్వామిగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు. అతని నుంచి దొంగిలించిన వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ స్వామి, పీసీలు రమేష్, రాజ్‌కుమార్, శివ, అశోక్‌లను సీఐ రాజు అభినందించారు.

బాలిక మృతికి కారణమైన.. ఆర్ఎంపీ రిమాండ్


ఆర్ఎంపీని అరెస్టు చూపుతున్న ఏఎస్పీ చంద్రయ్య

చందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలిక మృతికి కారణమైన ఆర్ఎంపీ సంజీవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ చంద్రయ్య తెలిపారు. తేలుకాటుకు గురైన బాలికకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్ఎంపీని చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ ఈనెల 19న కిష్టంపేట గ్రామానికి చెందిన మహేలకు తేలుకాటు వేసిందన్నారు. బాలికకు నిర్లక్ష్యంగా వైద్యం చేసి అపస్మారక స్థితిలోకి వెళ్లేందుకు కారకుడైన జోగాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ సంజీవ్‌పై ఈనెల 25న బాలిక తల్లి సరిత చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. విచారణ జరిపి ఆర్ఎంపీపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆర్ఎంపీ సంజీవ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు


దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీరాంనగర్‌లో బంగారు నగలు అపహరించిన ఇద్దరు దొంగలను జగిత్యాల పట్టణ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. నిందితుల వద్ద 3.6గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని ధర్మపురి బైపాస్‌రోడ్‌లో పట్టణ పోలీసులు రాత్రి సమయంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తుతెలియని ఇద్దరువ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సుమంత్‌తోపాటు ఓమైనర్ బాలుడు ఉన్నారు. విచారణలో వీరు జగిత్యాల పట్టణంలోని శ్రీరాంనగర్‌లో చాంద్‌బీ అనే వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న 3.6గ్రాముల బంగారు నగలు దోచుకువెళ్లినట్లు గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

బైక్ దొంగ అరెస్టు

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బైక్‌చోరీ కేసులో మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామానికిచెందిన రత్నంరాజ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రాజు శనివారం తెలిపారు. తాడిచర్లలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న చీర్ల తిరుపతిరెడ్డి ఈ నెల 27న స్థానిక పాతపెట్రోల్ పంపు వద్ద తన ఏపీ-15 ఏడీ7688బైక్‌ను పార్క్‌చేసి ఈనెల28న తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి బైక్ దొంగిలించిన రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం దోపిడీకి గురైంది

● రాష్ట్రాన్ని దోచినోడిని జాతిపిత, బాపూజీ అని ఎలా అంటారు? ● కాళ్లేశ్వరం ప్రాజెక్టులో రూ. 80వేల కోట్లు కేసీఆర్ దోచాడు ● ఈ-కారు రేసులో రూ.49 కోట్లు బీఆర్ఎస్ పార్టీ ఫండ్‌కు.. ● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం దోపిడీకి గురైందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి 140సంవత్సరాల చరిత్ర ఉందని, కేటీఆర్ తాటాకు చప్పుళ్లకు భయపడేటోళ్లు లేరని అన్నారు. శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీకార్యదర్శి గజ్జెల కాంతం, కాంగ్రెస్ నాయకులు పీవీ నర్సింహారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో గజ్జెలకాంతం మాట్లాడారు. 4కోట్లప్రజలు సంతోషంగా జీవిస్తారని సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం దోపిడీకి గురైందని ఆరోపించారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా సిరిసిల్లలో మాఫియాలను తయారుచేసి కోట్లాది రూపాయలను అనుచరవర్గం సంపాదించుకుందన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతంలో 15లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని, కేసీఆర్ ముఖ్య మంత్రి అయ్యాక ఆ భూములను కబ్జాలు పెట్టి వేలకోట్లు ఆయన కుటుంబం సంపాదించుకుందని ఆరోపించారు. కేసీఆర్ వచ్చాకే తెలంగాణ ఉద్యమం మొదలు కాలేదని, 1969లో మొదలై అనేకమంది ఉద్యమాన్ని నడిపించారన్నారు. 2001లో భూ స్వాములతో కలిసి రాజకీయం, అధికారం కోసం పార్టీ పెట్టిన కేసీఆర్ నాడు కాంగ్రెస్, టీడీపీలో పొత్తుపెట్టుకున్నాడని, తెలంగాణ రాష్ట్రంకోసం పార్టీ పెట్టలేదని ఆరోపించారు.

తెలంగాణ జాతిపిత, బాపూజీ అంటే కొండా లక్ష్మణ్‌బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్‌ను అనాలన్నారు. రాష్ట్రాన్ని దోచినోడిని జాతిపిత, బాపూజీ అని ఎట్లా అంటారని ప్రశ్నించారు. ఉద్యమంలో శ్రీకాంతచారి చనిపోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు కారణమని ఆరోపించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకుంటే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవాడు కాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇష్టమొచ్చినట్లు కేటీఆర్ మాట్లాడితే చేతులు కట్టుకొని కూర్చుండబోమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.70వేలకోట్ల ఖర్చుఉంటే కేసీఆర్ రూ.150వేల కోట్లకు కేసీఆర్‌పెంచి రూ.80వేల కోట్లు దోచాడని, కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్‌వేసి విచారణ జరుపు తోందన్నారు. ఈ-కారు రేసులో రూ.650కోట్లు కంపెనీలతో ఒప్పందం చేసుకొని రూ.49కోట్లు బీఆర్ఎస్ పార్టీఫండ్ కోసం తీసుకు న్నాడని ఆరోపించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధానకార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశంగౌడ్, ఎండీఖాజా, ప్రధాన కార్య దర్శి వెంగళ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుమాల వెంకటేశం, కే రాజు, ఆడెపు జగన్, మాజీ కౌన్సిలర్లు కుడికాల రవికుమార్,వేముల రవి, రాగుల జగన్, కత్తెర దేవదాస్, ఆడెపు ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, మాజీడైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగులరాములు, నాయకులుబొప్ప దేవయ్య, ధర్మేం దర్, శివరాజ్, ఎండీ అహ్మద్, గోనె ఎల్లప్ప, రంగ కిషన్, బీమారం శ్రీనివాస్, బైరి ప్రభాకర్, భాస్కర్, గుజ్జె రమేష్ పాల్గొన్నారు.

ఇంటి నంబర్ కోసం ఏడాదిగా పాట్లు

● ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

● ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల పట్టివేత


ఏసీబీకి పట్టుబడ్డ ఇద్దరు ఉద్యోగులు

సుల్తానాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్టీసీ బస్‌స్టాండ్ వెనుక ఇల్లు కట్టుకుని రెండేళ్లు అవుతోంది. ఇంటి నెంబర్ కోసం ఏడాదిగా తిరుగుతున్నా. రేపు మాపు అంటూ చివరకు పది వేలు లంచం ఇస్తేనే ఇంటి నెంబర్ కేటాయిస్తామన్నారు. అధికారుల తీరుపై విసిగి ఏసీబీ అధికారు లను ఆశ్రయించినట్లు బాధితుడు అర్నకొండ ప్రసాద్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని పూసాల రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ షాప్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బిల్ కలెక్టర్ విజయ్ ఐదు వేల రూపాయలు బాధితుడు అర్నకొండ ప్రసాద్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని మున్సిపాలిటీ కార్యాలయానికి తీసుకువచ్చి విచారించారు. ఆర్ఐ వినోద్, బిల్ కలెక్టర్ విజయ్ ఇద్దరు బాధితుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు నిర్ధారించుకుని లంచం డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరిని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

వరకట్నం కోసం.. వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మల్యాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నూకపల్లికి చెందిన నులిగొండ అలియాస్ మరిశెట్టి సుప్రియకు జగిత్యాల మండలం జాబితాపూర్‌కు చెందిన గంగమహేశ్‌తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు కాగా కొన్నా ళ్లుగా సుప్రియను భర్త వరకట్నం కోసం వేధిస్తుండడంతో ఆమె మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు..

పట్టించుకోని అధికారులు


రాఘవాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయబావి

మానకొండూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి పక్కన వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా వెడల్పు చేసి తారు రోడ్డును నిర్మించారు. అయితే మండల కేంద్రం నుంచి పచ్చునూర్ వరకు సుమారు 16కిలోమీటర్ల వరకు రోడ్డు వెంబడి సుమారు 10కి పైగా వ్యవసాయబావులు ఉన్నాయి. ఈ రోడ్డు వెంబడి ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, ఆటోలు, వందలాది ద్విచక్ర వాహనాలు నిత్యం నడుస్తుంటాయి. బావులు రోడ్డు పక్కన 20మీటర్ల లోతు వరకు ఉండి పూర్తి స్థాయిలో నీరు ఉండడంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ బావుల వద్ద ఎలాంటి రక్షణ గోడ నిర్మించలేదు. కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వ్యవసాయబావుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగతనం

జగిత్యాలరూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలఅర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ పంచాయతీ పరిధి గోపాల్‌రావుపేటలోని పెద్ద పులివాగు సమీపంలోని పొలాలవద్ద గల ఐదు వ్యవసాయ విద్యుత్‌మోటార్లను శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు అత్తినేని గంగాధర్, రౌతు శేఖర్, దావ శంకర్, కొల్లూరి రవీందర్, అత్తినేని గంగన్న తెలిపారు. మోటార్లు లేకపోవడంతో నారుమడులు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదనవ్యక్తం చేశారు. పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తుండగా కొర్కల్ మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పదిట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎద్దుల దొంగలు పట్టివేత

వీణవంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన బావు రవికి చెందిన ఎద్దులను ఈ నెల19వ తేదిన దొంగలు వ్యవసాయపొలం నుంచి తోలుకుపోయారు. దీనిపై బావు రవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేకబృందాన్ని ఏర్పాటుచేసి దర్యాప్తుచేశారు. శనివారం ఎద్దులను దొంగలించిన ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. తడిగొప్పుల అజయ్, మిడిదొడ్డి అభిలాష్‌తోపాటు బాలున్ని అరెస్టు చేశామన్నారు. ఎద్దులను పోలీసులు బాధితుడు రవికి అప్పగించారు.

పెట్రోల్ బంకుల్లో అక్రమాలు..

● ఆందోళనలకు దిగుతున్న వాహనదారులు

● పట్టించుకోని అధికారులు


ఆందోళన చేస్తున్న వాహనదారులు(ఫైల్)


ఎల్లారెడ్డిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు పెట్రోలు బంకుల్లో తూకాల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల లీటరు పెట్రోలు పోయించుకుంటే 900 నుంచి 950 ఎంఎల్ మాత్రమే వస్తోంది. బంకుల్లో ఇంధనం నిల్వ చేసే భూగర్భ ట్యాంకుల నిర్వహణ సక్రమంగా లేక నీరు కలుస్తోంది. తూకాల్లో వ్యత్యాసం, నీరు వస్తుండడం వల్ల వాహనదారులు ఆందోళనలకు దిగుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


పెట్రోలులో వచ్చిన నీరు

● **నిబంధనలు గాలికి..**

మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, కోరుట్లపేట, అల్మాస్‌పూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆయా సంస్థలకు సంబంధించిన డీజిల్, పెట్రోలు బంకులున్నాయి. ఏళ్లుగా నిర్వహణ లేకపోవడంతో బంకుల్లో పెట్రోలుతో పాటు నీళ్లు వస్తున్నాయి. ఇటీవల వాహనదారులు బంకుల్లో ఆందోళనలకు దిగిన ఘటనలు ఉన్నాయి. మరోవైపు పెట్రోలు బంకుల్లో ఆటోమేటిక్ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో కొలతల్లో తేడా ఉండదని వాహనదారులు భావిస్తున్నారు. అయితే కొలతల్లో వ్యత్యాసం వచ్చేలా యజమానులు యంత్రాలను సరిచేస్తున్నట్లు తెలుస్తోంది. లీటరుకు 50 నుంచి 100 ఎంఎల్ తక్కువ వస్తోంది. కొందరు వాహనదారులు గుర్తించి యజమానులతో గొడవకు దిగడంతో సర్దిచెప్పి తప్పించుకుంటున్నారు. వాహనదారులు లీటర్ల చొప్పున కాకుండా డబ్బుల వారిగా పోయించుకోవడం బంకు యజమానులకు మరింత కలిసి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టాలను కోరుతున్నారు.

వాహనం చెడిపోతోంది..
- హబీబ్, వాహనదారుడు



బంకుల్లో పోయించుకున్న పెట్రోలు కల్తీ కావడం వల్ల వాహనం స్టార్ట్ కావడం లేదు. లీటరు పోయిస్తే తక్కువ వస్తోంది. పెట్రోలులో నీళ్ల వస్తున్నాయి. వాహనం చెడిపోతోంది. వాహనం రిపేరు చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు బంకుల్లో తనిఖీలు చేయాలి.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్లు ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్‌పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్ల హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్ల పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్ల వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో పొగలు



బస్సు నుంచి పొగలు రాకుండా ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

భగత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలోని ఎలక్ట్రిక్ బస్సులో శనివారం పొగలు వ్యాపించాయి. జేబీఎం ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సు నంబరు టీఎస్ 02 టీ 1099 డిపోలో పార్క్ చేసింది. బస్సును తీసుకెళ్లేందుకు వచ్చిన డ్రైవర్ స్టార్ట్ చేయడంతో ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ వెంటనే ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి విషయం చెప్పగానే ఫైర్‌సిబ్బంది వచ్చి ఆర్పి వేశారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

సుభాష్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైంది. కొత్తనీటితోపాటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఆరోగ్య సమస్యలూ పెరుగుతాయి. తాగునీటి కలుషితంతో జ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు, తలనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ప్రధానంగా వర్షం నీటి నిలువతో దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, చికున్‌గున్యా, స్వైన్ ఫ్లూకు సంబంధించిన వైరస్‌లు, బ్యాక్టీరియాల వ్యాప్తికి తోడ్పడడంతో జ్వరాలు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. సీజనల్ వ్యాధులు, జ్వరాలపై అవగాహన అవసరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

● చికున్‌గున్యా

చికున్ గున్యా వైరస్ కూడా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది ప్రాణాతంకంకాని వైరల్ వ్యాధి అని వైద్యులు చెబుతున్నారు. చికున్‌గున్యా వచ్చిన వారిలో తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి.

● మలేరియా

ఈ కాలంలో మలేరియా వ్యాప్తి కూడా ఎక్కువే. మలేరియా జ్వరానికి కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవి ఆడ అనాఫిలస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. చల్లని వాతావరణంతో ఫ్లూ వ్యాధి కూడా ఇబ్బంది పెడుతుంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారిపై ఇది వెంటనే దాడిచేస్తుంది. ముక్కు కారడం, జలుబు, దగ్గు, ఆయాసం ప్రధాన లక్షణాలు.

● టైఫాయిడ్

టైఫాయిడ్ అనేది కలుషిత ఆహారం, నీరు ద్వారా వ్యాపించే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్. నిరంతర జ్వరం, బహీనత, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

● ఇన్‌ఫ్లూయింజా(ఫ్లూ)

ఇన్‌ఫ్లూయింజా అనేది శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేసే వైరల్ ఇన్‌ఫెక్షన్. వర్షాకాలంలో ఇది ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. తేమతో కూడిన పరిస్థితుల కారణంగా ఇది సులభంగా వ్యాపిస్తుంది.

● డెంగ్యూ

డెంగ్యూ జ్వరం వైరస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. నిలకడగా ఉన్న నీటిలో ఇవి సంతానోత్పత్తి చేస్తాయి. పాత డ్రమ్ములు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన నీటి తొట్టెల్లో ఈ దోమలు ఎక్కువగా ఉంటాయి. ఈ దోమలు కుట్టిన 7 నుంచి 8 రోజుల్లో హఠాత్తుగా జ్వరం రావడం, కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై దద్దుర్లు, వాంతులు విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో ప్లేట్‌లెట్స్ తగ్గి షాక్ సిండ్రోమ్‌కు దారి తీస్తుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



వర్షాకాలం వ్యాధులను కూడా మోసుకొస్తుంది. ఇందులో దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటివి వ్యాపిస్తాయి. వీటి బారిన పడకుండా ఉండాలంటే ముందుగా ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా మురుగు నీరు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చెప్పే జాగ్రత్తలను పాటించాలి. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి. దోమ తెరలు, లిక్విడ్‌లు వాడాలి. తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా జాగ్రత్తపడాలి. పరిశుభ్రమైన నీరు, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు ఆరోగ్యసూత్రాలు పాటించేలా వారికి వివరించాలి.

అర్చక పోస్టుల భర్తీకి ఖాళీల వివరాల కోసం ఆదేశాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అర్చకపోస్టుల భర్తీకి ఖాళీల వివరాలు పంపాలని రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయం నుంచి జిల్లాల్లోని అధికారులకు శనివారం ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఉప ప్రధానార్చక, ముఖ్య అర్చక, అర్చక, పరిచారక పోస్టులను ఖాళీల ఆధారంగా త్వరలో భర్తీచేసేందుకు సన్నాహాలు ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలోని వేములవాడ,కొండగట్టు,ధర్మపురి ఆలయాల వివరాలు కమిషనరేట్ కార్యాలయంలో తెలియాల్సిఉండగా జిల్లాలో 6ఏ,బీ,సీ ఆలయాల్లో ఉపప్రధానార్చకుడు ఒక పోస్టుతో పాటు ముఖ్య అర్చకపోస్టులు ఏడుకు ఏడు భర్తీ అయిఉన్నాయి. అర్చక విభాగంలో 64పోస్టులుండగా 58మంది, పరిచారక విభాగంలో 28పోస్టులకు 23మంది విధులు నిర్వహిస్తున్నారు. అర్చక విభాగంలో 6, పరిచారక విభాగంలో 5చొప్పున ఈ రెండు విభాగాలు కలిపి 11పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరంఉందని సహాయ కమిషనర్ కార్యాలయం వెల్లడించారు. అనలేపోస్టులు మంజూరుకానివి, ప్రస్తుతం ఖాళీలు ప్రకటించినవి కలిపి సుమారు 51ఆలయాలున్నాయి. రాష్ట్ర కమిషనర్ తదుపరి ఆదేశాలమేరకు ఆలయాల పేర్లతో వివరాలు పూర్తిగా తెలుపవచ్చని, ప్రస్తుతం ఖాళీల వివరాలు పంపిస్తున్నామని ఉమ్మడి జిల్లా సహాయకమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు.

వేతన వెతలు..

- మూడు నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- కుటుంబ పోషణకు ఇబ్బందులు



జాగీర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

సైదాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్యం మొదలు.. నల్లానీరు, వీధిదీపాలు, పన్నులవసూళ్లు ఇలా అన్నిరకాల పనులుచేస్తూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచే గ్రామపంచాయతీ కార్మికులకు వేతన వెత తప్పడం లేదు. మూడునెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను ఒకే గొడుగు కిందకు తెచ్చి గతప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లుగా జీవో తీసుకువచ్చింది. గ్రామ పంచాయతీలో పని చేసే వారు ఏ పనైనా చేయాలి. అందరికీ ఒకే వేతనం నిర్ణం యించింది. దీంతో గ్రామ పంచాయతీ వర్కర్లు మల్టీపర్పస్ వర్కర్లుగా కొనసాగుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నామని, ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

సింగరేణి మెడికల్ కళాశాలలో 150 సీట్లకు అనుమతి

● ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్



సింగరేణి మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నిర్వహణలో లోపం ఉండడంతో జాతీయ వైద్య విద్య కమిషన్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అనుమతికి అభ్యంతరాలు తెలిపింది. ఈ ఏడాది సింగరేణి మెడికల్ కళాశాల 4వ సంవత్సరంలో అడుగు పెట్టనున్నది. కళాశాలల లోపాలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈతో పాటు వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్‌ను, డీన్‌లను ఈ నెల 18న ఢిల్లీకి రావాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి, ప్రిన్సిపాల్ డీన్‌లతో చర్చించిన ఎన్ఎంసీ సింగరేణి మెడికల్ కళాశాలతో పాటు మిగతా 25కళాశాలలకు 150ఎంబీబీఎస్ సీట్లకు అనుమతిని ఇస్తున్నట్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26కళాశాలల్లో అసౌకర్యాలు ఉండడం, కొన్ని కళాశాలలు గోడౌన్‌లలో నిర్వహించడం, విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడం, వసతి గృహాలు లేకపోవడం, బోధన సిబ్బంది లేకపోవడంతో ఎన్ఎంసీ తీవ్ర అభ్యంతరం చెప్పింది. దీనిపై రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి, వైద్యవిద్య సంచాలకులు, ప్రిన్సిపాల్స్ డీన్‌లు అసౌక ర్యాలపై నివేదిక ఇవ్వడంతో శనివారం 150సీట్ల నిర్వహణపై అనుమతులు ఇచ్చింది.

2న ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపికకు ప్రిలిమినరీగా గోదావరిఖని, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లలో జూలై 2న మహిళా ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్ రావు ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీల్లో ఉమ్మడిజిల్లా జట్టు పాల్గొంటుందని పేర్కొ న్నారు. ఉమ్మడిజిల్లా జట్టు ఎంపికకు ముందుగా 60మంది మహిళా క్రికెటర్లను ఎంపిక చేసి వారిని నాలుగు జట్లుగా విభజించి రౌండ్ రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లను కరీంనగర్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మ్యాచ్‌లలో ప్రతిభ చాటే క్రీడాకారులను ఉమ్మడిజిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. ఆయాప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని జూలై 2నఉదయం 8గంటలకు మైదానాల్లో కోచ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు కరీంనగర్‌లో శ్రవణ్(కేడీసీఏ ఆఫీస్ నెట్స్) 8688768775, గోదావరిఖనిలో కిరణ్‌కుమార్(జీఎంఆఫీస్ గ్రౌండ్) 9866351620, జగిత్యాలలో జలపతి (వివేకానంద స్టేడియం) 9948064712, సిరిసిల్లలో మనోహర్ (రైజింగ్ స్పోర్ట్స్ అకాడమీ)ను 8497979747 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చినుకు రాలదు.. చింత తీరదు..

(5వ పేజీ తరువాయి)

సాధించేందుకు మే నెలాఖరులో కురిసిన అకాల వర్షాలకు పచ్చి రొట్ట విత్తనాలు పొలాల్లో చల్లారు. సన్న రకం వరి ధాన్యం పంటను సాగు చేసే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తుండడంతో చాలా మంది రైతులు సన్నాల సాగు వైపు మొగ్గు చూపారు. 60 నుంచి 70 శాతం వరకు సన్న రకం వరి పంటను పండించేందుకు వరి నార్లు పోశారు. వర్షాలు పడక పోవడంతో దుక్కులు ముందుకు సాగడం లేదు. చెరువులు, కుంటల్లో నీళ్లు అడుగంటి పోగా, వ్యవసాయ బావుల్లో కూడా నీళ్లు తగ్గు ముఖం పడుతున్నాయి. గత ఏడాది ఈ సమ యానికి వరి నార్లు ఊపందుకున్నాయి. 30 శాతానికి పైగా వరి నాట్లు పూర్తయ్యాయి. కానీ ఈ సీజన్‌లో 5 శాతం వరి నాట్లు కూడా పడని పరిస్థితి నెలకొన్నది. వరి తర్వాత అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తుండగా, కొందరు రైతులు ఇప్పటి వరకు కూడా దుక్కిలో విత్తనాలు వేయ లేదు. ఒక చినుకు పడితే విత్తనాలు విత్తాలని చూస్తున్నారు.

'రామగుండం'కు రూ.120కోట్లు కేటాయించండి

● సీఎస్‌ను కోరిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


సీఎస్‌తో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజక వర్గ అభివృద్ధికి, మౌలిక వసతుల కోసం రూ.120 కోట్లు కేటాయించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును కోరారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించి నిధులు కేటాయించాలని కోరారు. రామగుండంలో డ్రైన్లు, ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీని కోసం రూ.80కోట్లు కేటాయించాలని, , రామగుండంలో మల్టీ స్పెషల్ ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.250కోట్లు, సింగరేణిలో పని చేసే కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. విద్యుత్, నీటి సౌకర్యాల కల్పన కోసం రూ.100కోట్లు కేటాయించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం రూ.25కోట్లు కేటాయించాలని పేర్కొనగా.. స్పందించిన చీఫ్ సెక్రటరీ వివిధ శాఖలకు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని సూచించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

సిమ్స్ ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సిమ్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి టాలెంట్ పరీక్షలో స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పదవ తరగతి విద్యార్థిని వైష్ణవి రాష్ట్ర స్థాయి సెకండ్ ర్యాంక్, 8వ తరగతి విద్యార్థిని కే ప్రసన్న, ప్రైమరీ విభాగంలో నాలుగవ ర్యాంక్‌ను నాలుగవ తరగతి విద్యార్థి అశ్విన్ సాధించారు. హైద్రాబాద్‌లో విద్యార్థులను అభినందించారు.

చైతన్య స్కూల్‌లో తండ్రుల దినోత్సవం


పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తండ్రులు

కోల్‌సిటీటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సప్తగిరికాలనీలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో శనివారం తండ్రుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏజీఎం అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ తండ్రి కుటుంబానికి మార్గదర్శకుడని, పిల్లల కోసం తండ్రులు సమయాన్ని కేటాయించాలన్నారు. విజేతలుగా నిలిచిన తల్లిదండ్రులకు బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, డీన్ వెంకటస్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

● ఎంపీడీవో కలికోట రామ్‌మోహన చారి

పాలకుర్తి,జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగిందని,ప్రతి ఉపాధ్యాయురాలు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ,నాణ్యమైన విద్య అందించాలని పాలకుర్తి ఎంపీడీవో కలికోట రామ్‌మోహనచారి అన్నారు.శనివారం ఆయన మండలం పరిధిలోని పుట్నూర్ కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించారు. ఎంపీవో ఉప్పు సుదర్శన్ తదితరులున్నారు.

- జయ్యారంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ నిర్మాణ పనులను శనివారం ఎంపీడీవో కలికోట రామ్‌మోహనచారి పరిశీలించారు.

మాయమాటలతో నమ్మించిన బీఆర్ఎస్

పాలకుర్తి,జూన్ 28(ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మాయమాటలతో నమ్మించి వంచనకు గురి చేసిందని ఓబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ అన్నారు. శనివారం ఎల్కలపల్లి గ్రామంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ద్రోహాన్ని ప్రజలు గ్రహించారన్నారు.

ఎన్టీపీసీ పీఎస్‌ను సందర్శించిన డీసీపీ

జ్యోతినగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డీసీపీ పి.కరుణాకర్ శనివారం సాయంత్రం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉడాలనిడీసీపీ కరుణాకర్ సూచించారు. రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్‌సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాఘవులునగర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మున్నూరు కాపు కులస్థులకు కోసం శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మున్నూరు కాపు ప్రధాన కార్యదర్శి సతీష్ ప్రారంభించగా 110 మందికి డాక్టర్ దీక్షిత్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

వారసంతను అభివృద్ధి చేయాలి

రామగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామ పంచాయితీ పరిధిలో గల వారసంతను అభివృద్ధి చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గౌతమ్‌గోవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం మండల కార్యదర్శి జూపాక రాంచందర్ ఆధ్వర్యంలో సందర్శించారు.

తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

కమాన్‌పూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌స్కూల్ విధానంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదవడానికి 2025-2026విద్యా సంవత్సరానికి జూలై 11న తేదీ వరకు నిర్దేశిత రుసుముతో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, కమాన్‌పూర్‌లోని తెలంగాణ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమాన్‌పూర్ ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ తెలిపారు.

కాటమయ్య కిట్లు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొట్లపల్లి గ్రామంలో గౌడసంఘం సభ్యులకు శనివారం కాటమయ్య రక్షణ కిట్లను సుల్తానాబాద్ ఎక్సైజ్ ఎస్సై రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ సంతోష్, ప్రీతం ఉన్నారు.

● ఓదెల: కనగర్తి రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో బీసీ కార్పొరేషన్ అధికారులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు, శిక్షకులు జాగిరి అంజి గౌడ్, మూల మల్లేశం గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షణలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్‌లపై శిక్షణ నిర్వహించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

పెద్దపల్లి రూరల్ : మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు గంప విజయరాణి పదవీ విరమణ సందర్భంగా శనివారం ముందస్తుగా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

రామగుండంలో ఉత్కంఠకు తెర

● 60 డివిజన్లు, 1.85లక్షల ఓటర్లు ● 1వ డివిజన్‌గా మేడిపల్లి, 60వ డివిజన్‌గా ఓల్డ్ మున్సిపల్ ఏరియా



కోల్‌సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో ఉత్కంఠకు తెరపడింది. డివిజన్ల పునర్విభజనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ కార్యదర్శి కేకే శ్రీదేవి ఈ నెల 21న జారీ చేశారు. డివిజన్ల సంఖ్యను 50 నుంచి 60కి పెంచారు. ఓటర్ల సంఖ్య 1,85,417గా గుర్తించారు. డివిజన్ల పునర్విభజనపై స్పెరికల్ (గోళాకార) విధానాన్ని అవలంబించారు. డ్రాఫ్టులో 1వ డివిజన్‌లో లింగాపూర్‌ను, 60వ డివిజన్‌గా లక్ష్మీనగర్, అశోక్‌నగర్‌లను చూపగా, తుది జాబితాలో మాత్రం స్వరూపాలు మారిపోయాయి. గోళాకార విధానంతో ఉత్తరం నుంచి తూర్పునకు డివిజన్ల విభజనను చేపట్టారు. దీంతో 1వ డివిజన్‌గా మేడిపల్లి పీకే రామయ్యక్యాంపు, ఇందిరమ్మకాలనీలను చేర్చారు. 60వ డివిజన్‌గా పాత 48వ డివిజన్ ఏరియా అయిన ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్, మారుతినగర్, సిటీ స్కాన్ ఏరియా, ఊర్వశి థియేటర్ ఎదురుగా ఉన్న ప్రాంతాలను చేర్చారు. కార్పొరేషన్‌లో ఎల్కలపల్లి గేట్, లింగాపూర్, కుందనపల్లి అక్బర్‌నగర్, వెంకట్రావ్‌పల్లిని చేర్చారు. దీంతో యైటింక్లయిన్‌కాలనీలో 14, 15, 16, 17, 18, 19, 20 డివిజన్లుగా ఏర్పడ్డాయి. ఎన్‌టీపీసీ క్రషర్‌నగర్ నుంచి గోదావరిఖని మెడికల్ కళాశాల ఏరియా వరకు 8డివిజన్లు చేశారు. 1, 2, 3, 24, 30, 31, 33, 34లుగా విభజించారు. ఎన్‌టీపీసీ పీటీఎస్, టీటీఎస్ ప్రాంతాలను 24వ డివిజన్‌గా గుర్తించారు. వీర్లపల్లి నుంచి లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్, చైతన్యపురి కాలనీ, గౌతమినగర్, శాంతినగర్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ, మాతంగి కాలనీ, కాజీపల్లి ప్రాంతాలను మూడు డివిజన్లుగా గుర్తించారు. 21, 22, 23డివిజన్లుగా చేర్చారు. మార్కండేయకాలనీ, శారదానగర్, కేసీఆర్ కాలనీ ప్రాంతాలను మూడు డివిజన్లుగా విభజించారు. శాంతినగర్ పక్కనే ఉన్న లూర్ధునగర్, ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాలను, దుర్గానగర్ ప్రాంతన్ని ఒక డివిజన్‌గా గుర్తించారు. గెస్ట్‌హౌస్ ఏరియా, చంద్రబాబుకాలనీ, ఆర్‌టీసీ కాలనీలను ఒక డివిజన్‌గా చేర్చారు. గౌతమిసాయి కళాశాల పక్క నుంచి శారదానగర్ పార్కు ఏరియా ప్రాంతాలను ఒక డివిజన్‌గా గుర్తించారు. వీటిని 47, 48, 49డివిజన్లుగా విభజించారు. రామగుండం పట్టణ పరిధిలో 6డివిజన్లు చేశారు. లింగాపూర్‌ను 29వ డివిజన్‌గా గుర్తించారు. 25, 26, 27, 28, 29, 30డివిజన్లుగా విభజించారు. డివిజన్ల పునర్విభజనకు సంబంధించి డ్రాఫ్టుకు, తుది జాబితాకు మధ్య భారీ వ్యత్యాసాలు వచ్చాయి. సరాసరి 2900ఓటర్లను ఒక డివిజన్‌గా గుర్తించారు. ప్రభుత్వం డ్రాఫ్టు విడుదల చేసిన తరువాత రామగుండంలోనే తక్కువ అభ్యంతరాలు వచ్చాయి. 88 అభ్యంతరాగా 65అభ్యంతరాలను పరిష్కరించారు. కొన్ని డివిజన్లలో ఒకే అంశంపై ఏడు ఎనిమిది అభ్యంతరాలు వచ్చాయి.

హద్దుల విషయంలో గందరగోళం

కార్పొరేషన్‌లో డివిజన్ల పునర్విభజనపై జారీ చేసిన తుది జాబితాలో గందరగోళం నెలకొన్నది. ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర హద్దులను పెటారు. కొన్ని డివిజన్ల హద్దుల విషయంలో తప్పులు దొర్లినట్టు తెలుస్తుంది.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

రామగుండంలో డివిజన్ల పునర్విభజనలో కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక దృష్టి పెట్టారు. పలు డివిజన్లలో డ్రాఫ్టుల్లో తప్పులు దొర్లడంతో తుది జాబితా రూపకల్పనలో ఆయన స్వయంగా పరిశీలన జరిపారు. ముఖ్యంగా సింగరేణి క్వార్టర్లు ఉన్న ప్రాంతాలను, గ్రామీణ వాతావరణం ఉన్న ప్రాంతాలను ఒక డివిజన్లుగా పరిగణించారు. జనగామ, మల్యాలపల్లి, మారేడుపాక, లింగాపూర్ ప్రాంతాల విషయంలో దీనిని అనుసరించారు.

21వ తేదీతోనే జీఓ

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల పునర్విభజనపై ఈ నెల 21వ తేదీతోనే జీఓ విడుదల కాగా, 28న వెలుగులోకి వచ్చింది. కరీంనగర్, మంచిర్యాల కార్పొరేషన్లకు సంబంధించి రెండు రోజుల క్రితమే 21వ తేదీన వెలువడి జీఓలు వెలుగులోకి వచ్చాయి. రామగుండంలో మాత్రం రెండు రోజుల తరువాత బహిర్గత పరిచారు.

రామగుండం అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్


చౌరస్తాలో చిరువ్యాపారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రామగుండంలో జరుగుతున్న అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి ధ్వజమెత్తారు. శనివారం గోదావరిఖని చౌరస్తాలో చిరు వ్యాపారులను కలిసి మాట్లాడారు. షాపింగ్ నిర్మాణంలో కొన్ని టేలాలు అడ్డంగా ఉండడం వల్ల వాటిని ఎదురుగా వేసుకోవాలని సూచించడం జరిగిందని, దీనిపై బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం తగదన్నారు. ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యే చందర్ రామగుండంలో ఒక నిర్మాణాన్నైనా చేపట్టారా అని ప్రశ్నించారు. 18నెలల కాలంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ రామగుండం అభివృద్ధికి రూ.900కోట్లు తీసుకువచ్చారని అన్నారు. గోదావరిఖని చౌరస్తా, శివాజీనగర్, గాంధీ మార్కెట్‌లో 270షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, తక్కువ అద్దెలతో వ్యాపారులకు కేటాయించనున్నట్టు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కోల్‌సిటీటౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. శనివారం గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో యాజమాన్యం ఆధ్వర్యంలో ఇకో క్లబ్ కమిటీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్య మేరి, మున్సిపల్ వార్డు ఆఫీసర్ మంగ, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపుపై స్పెషల్ డ్రైవ్

కోల్‌సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం రామగుండం నగర పాలక సంస్థ సిబ్బంది గోదావరిఖని పోచమ్మ మైదానంలోని ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక చెత్తను పూర్తిగా తొలగించి, శుద్ధి చేసి మరొక సారి చెత్త పడవేయకుండా ముగ్గులు వేశారు.

బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావు

కళ్యాణ్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బహుభాషా కోవిదుడు దివంగత మాజీ పీవీ నర్సింహారావు అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దాసరి విజయ్ ఆధ్వర్యంలో పీవీ నర్సింహారావు జయంతిని గోదావరిఖని చౌరస్తాలో నిర్వహిచగా ఈ కార్యక్రమానికి తిప్పారపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడిన గొప్ప నాయకుడు ప్రధాని అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, గట్ల రమేష్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, దూళికట్ట సతీష్ పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 104వ జయంతిని శనివారం ఎన్ఎస్‌యూఐ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.


గోదావరిఖనిలో కాంగ్రెస్ నాయకుల నివాళి

● మంథని: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా హైదారాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పీవీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నేతలు మాచీడి రాజుగౌడ్, ఏగోళపు శంకర్‌గౌడ్, జక్కు రాకేష్, పూదరి సత్యనారాయణ, పుప్పాల తిరుపతిలు పాల్గొన్నారు. మంథనిలోని పీవీ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, కుమార్, గట్టయ్యలు పూల మాలలు వేసి నివాళుర్పించారు.


పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధు.

● సుల్తానాబాద్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి కార్యక్రమాన్ని స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు జరుపుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్ రావు, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల శాఖల అధ్యక్షులు అబ్బయ్య గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు

ఎలిగేడు, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి): ప్రజాప్రభుత్వంలో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 348 రేషన్‌కార్డులు, 16కల్యాణలక్ష్మి, షాదీముబారక్, స్వశక్తిసంఘం మహిళలకు బీమా, సీఎంఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆశలు వదులుకున్న రేషన్‌కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ యాకన్న, ఐకేపీ ఏపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రేజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కాం గ్రెస్ దుగ్యాల సంతోష్‌రావు పాల్గొన్నారు.


ఎలిగేడులో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే


జూలపల్లిలో..

● జూలపల్లి: కాంగ్రెస్ పేదల బతుకుల్లో వెలుగులు నింపుతుదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. జూలపల్లి మండల కేంద్రంలో ఒక కోటి 40లక్షల రూపాయల నిధులతో శనివారం పలు అభివృద్ధి పనులకు స్థానిక నాయకులతో కలిసి శంఖుస్థాపన చేశారు.

● సుల్తానాబాద్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 605 మందికి కొత్త రేషన్ కార్డులను అందజేయగా, 33 మంది లబ్ధిదారులకు రూ 33 లక్షల 3 వేల 828 ల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, 105 మంది బాధితులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నేర సమీక్ష సమావేశంలో సీపీ అంబర్ కిశోర్ ఝూ


పోలీసులకు రివార్డు అందజేస్తున్న సీపీ

కోల్‌సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తతో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ పేర్కొన్నారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహిచారు. డీసీపీలు, అడిషనల్ డీసీపీ(అడ్మిన్), ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్, డివిజన్, జోన్లవారీగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులపై సమీక్ష జరిపారు.

నూతన అధికారులను సన్మానించిన టీబీజీకేఎస్

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టుకు బదిలీపై వచ్చిన అధికారులను శనివారం టీబీజీకేఎస్ నాయకులు సన్మానించారు. పదోన్నతిపై ప్రాజెక్టు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావుల పాపయ్య, బదిలీపై వచ్చిన వెల్ఫేర్ ఆఫీసర్ స్వరూప్‌లను టీబీజీకేఎస్ బృందం శాలువాలతో సన్మానించారు. ప్రాజెక్టు నాయకులను డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సంపత్‌రెడ్డి అధికారులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి సాంబయ్య, నాయకులు సీహెచ్ శ్రీనివాస్, తిరుపతి, శ్రీకాంత్‌రావు, ప్రవీణ్, వెంకటయ్య, శ్రీకాంత్, జబ్బార్‌పాష, జీవన్‌రెడ్డి, కేశవరావు పాల్గొన్నారు.



సింగరేణి విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచాలి

సింగరేణిపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

గోదావరిఖని, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ చేపట్టను న్న 800మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, 500మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్, 500మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాట్ల సన్నాహాలను మరింత వేగవంతం చేయాలని, కాల పరిమితిని విధించుకొని సత్వరమే ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శనివారం మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌లో సింగరేణి కాలరీస్ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టనున్న సోలార్ ప్లాంట్లు, పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్, ఇతర పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్లపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ లోయర్ మానేరు డ్యాం రిజర్వాయర్‌పై నిర్మించనున్న 300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్‌పై నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌లకు ఇరిగేషన్ శాఖ ద్వారా రావాల్సిన అనుమతులకు లేఖలు రాయాలని ఆదేశాలు ఇచ్చారు. అలాగే సింగరేణి సంస్థ రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డీపీఆర్‌లను వచ్చే నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. ఆర్‌జీ-1 ఏరియాలో మేడిపల్లి ఓపెన్ కాస్ట్ నీటి సంపు ఆధారంగా నిర్మించ తలపెట్టిన 500మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. సీఎండీ ఎన్ బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ చేపట్టనున్న ప్రాజెక్టుల గురించి వివరించారు.


కార్మికుడి భార్యకు రూ.1.2కోట్ల ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

కార్మికుడి కుటుంబానికి రూ.1.2 కోట్ల ప్రమాద బీమా చెక్కు అందజేత

రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణిలో అమలు చేస్తున్న ఉచిత ప్రమాద బీమా పథకం కింద ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఒక కార్మికుడి కుటుంబానికి రూ.1.2కోట్ల బీమా సొమ్ము చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రజాభవన్‌లో శనివారం అందజేశారు. చెక్కును మృతి చెందిన ఆర్‌జీ-1ఏరియాకు చెందిన సపోర్టుమెన్ పెండ్రి రంజిత్ కుమార్ భార్య లతకు అందజేశారు.

దేశవ్యాప్త సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలి


కార్మికులతో మాట్లాడుతున్న అయిలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జులై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఓసీపీ-3 కృషిభవన్, ఎస్అండ్‌డీ సెక్షన్‌తో పాటు సివిల్ డిపార్ట్‌మెంట్‌లో టీబీజీకేఎస్ నాయకులు కార్మికులను కలిసి దేశవ్యాప్త సమ్మెపై కార్మికులకు అవగాహన కల్పించారు. బొగ్గు గనుల వేలం కారణంగా రానున్న రోజుల్లో ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని, కార్మికుల వేతనాలు ఆర్థిక ప్రయోజనాల విషయంలో నష్టం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని టీబీజీకేఎస్ మొదటి నుంచి పోరాడుతుందని అన్నారు. అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, బేతి చంద్రయ్య, మామిడి తిరుపతి, ముస్కుల అనిల్‌రెడ్డి, నరేందర్, నరేష్, కమలాకర్ ఉన్నారు.

లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



డీవైజీఎం రవీందర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గోదావరిఖని, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆర్‌జీ-1 డీవైజీఎం, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డికి సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)నాయకులు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజాధనాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. సింగరేణిలో బొగ్గు బావులను ప్రైవేట్ పరం చేయవద్దని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు తగ్గకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు నరేష్, అశోక్, రాజేశం, కొమరయ్య పాల్గొన్నారు.